సాక్షి
నాగర్‌కర్నూల్
శుక్రవారం । 27 । జనవరి । 2023



ఉప్పొంగిన దేశభక్తి

గణతంత్ర వేడుకల్లో నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.

వివరాలు 8లో ▸



అంజన్న రథోత్సవం

పెద్దచింతరేవుల ఆంజనేయస్వామి రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
32.0 /16.3

వాతావరణం

ఉదయం, రాత్రి వేళల్లో చలి ప్రభావం ఉంటుంది. మధ్యాహ్నం ఎండగా ఉంటుంది. ఆకాశం నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నెమలి వాహనంపై అంజన్న



ఊర్కొండ: ఊర్కొండపేట అభయాంజనేయ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా అభయాంజనేయుడు నెమలి వాహనంపై ఊరేగాడు. గురువారం స్వామి వారికి అభిషేకం, అర్చనలు నెమలి వాహన సేవ భజన సభ్యులతో భజనలు వ్రతాలు నిర్వహించారు. నెమలి వాహన సేవతో ఆలయంలో అభయుడి కీర్తనలతో ప్రాంగణమంతా అభయుడి నామస్మరణతో మారుమోగింది. నెమలి వాహన సేవలో ఆలయ అర్చకులు దత్తాత్రేయ శర్మ, ప్రవీణ్ శర్మ, శ్రీనివాస్ శర్మ, మహేష్ శర్మ, సిబ్బంది వరలక్ష్మి, ఆలయ పాలకమండలి సభ్యులు, భక్తులు, ప్రజలు పాల్గొన్నారు.

చిరుధాన్యాలు పండించేలా చర్యలు


పెద్దకొత్తపల్లి: గ్రామాల్లో రైతులు చిరుధాన్యాలు పండించేలా సింగిల్‌విండోలు ప్రచారం నిర్వహించాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ శాంతాకుమారి తెలియజేశారు. కొత్తపేట సింగిల్‌విండో నూతన భవన నిర్మాణం కోసం కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరంహర్షవర్ధన్‌రెడ్డితో కలిసి జెడ్పీ చైర్‌పర్సన్ గురువారం కొత్తపేటలో భూమిపూజ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో మాట్లాడారు. కొల్లాపూర్ ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి రైతుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నాడన్నారు. జిల్లాలో అన్ని సింగిల్‌విండోల్లో రైతులతో సమావేశాలు నిర్వహించి చిరుధాన్యాలు కొర్రలు, ఆర్కలు, ఊదలు, సాములు పండించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. కొత్తపేట సింగిల్‌విండో రూ.50 లక్షలతో నిర్మాణం చేపట్టడంతో రైతులకు ఎంతో సౌకర్యంగా ఉంటుందన్నారు. సింగిల్‌విండో ద్వారా తీసుకున్న పంట రుణాలు సకాలంలో చెల్లిస్తే కొత్త రైతులకు రుణాలు ఇచ్చే అవకాశం ఉంటుందన్నారు. అనంతరం డీసీసీబీ డైరెక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడారు. మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లాలోనే కొల్లాపూర్ పరిధిలోని పాన్‌గల్, వీపనగండ్ల, తూముకుంట, కొత్తపేట, కోడేరు సింగిల్‌విండోలు రైతులకు ఎక్కువ రుణాలు ఇచ్చిన సింగిల్‌విండోలుగా ఉన్నాయని తెలియజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మేకల గౌరమ్మ, కొత్తపేట సింగిల్‌విండో అధ్యక్షుడు కట్ట రాజేందర్‌గౌడ్, వైస్‌చైర్మన్ రాముయాదవ్, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా సంక్షేమం

ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు

- సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి ప్రాధాన్యం
- కంటివెలుగులో భాగంగా జిల్లాలో 6 లక్షల మందికి పరీక్షలు
- గణతంత్ర వేడుకల్లో కలెక్టర్ ఉదయ్‌కుమార్

సాక్షి, నాగర్‌కర్నూల్: రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ ఫలాలు ప్రతి ఇంటికి అందుతున్నాయని కలెక్టర్ ఉదయ్‌కుమార్ అన్నారు. గురువారం 74వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా కలెక్టరేట్ ప్రాంగణంలో జాతీయ జెండా ఆవిష్కరణ అనంతరం పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ శాంతాకుమారి, ఎస్పీ మనోహర్‌తో కలసి స్వాతంత్ర్య సమరయోధురాలు అంబటి నీలావతిని సత్కరించారు. అనంతరం జిల్లాలో ఉత్తమ పనితీరు కనబర్చిన అధికారులు, ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ప్రజలనుద్దేశించి జిల్లా ప్రగతిని నివేదించారు. జిల్లాలో ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలను పకడ్బందీగా అమలు చేస్తున్నామని చెప్పారు. దళితబంధు కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని చారకొండ మండలాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసినట్లు తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు మొత్తం 1,708 మంది లబ్ధిదారుల ఖాతాల్లో ఒక్కో కుటుంబానికి రూ.10 లక్షల చొప్పున ఆర్థిక సాయాన్ని అందించినట్లు చెప్పారు. 'ధరణి' పోర్టల్ ప్రారంభించినప్పటి నుంచి జిల్లాలో 49,336 పెండింగ్ దరఖాస్తులను పూర్తి చేశామన్నారు. జిల్లా వ్యాప్తంగా రైతుబంధు కింద 2.88 లక్షల మంది రైతులకు రూ.3,195 కోట్లు అందజేశామని పేర్కొన్నారు. రైతుబీమా కింద ఇప్పటి వరకు 4,097 మందికి పరిహారం అందజేసినట్లు వివరించారు.



కలెక్టరేట్ ప్రాంగణంలో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఉదయ్‌కుమార్

కంటివెలుగు ద్వారా పరీక్షలు..

జిల్లాలో కంటివెలుగు రెండోదశ కార్యక్రమంలో భాగంగా 18 ఏళ్లు నిండిన మొత్తం 6 లక్షల మందికి కంటి పరీక్షలు ఉచితంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా 50 బృందాలు, 3 బఫర్ టీం ఏర్పాటు ద్వారా ప్రత్యేకంగా పర్యవేక్షించనున్నట్లు చెప్పారు. జిల్లా వ్యాప్తంగా 2,749 మందికి న్యూట్రిషియన్ కిట్లను పంపిణీ చేశామన్నారు. జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో మొత్తం 7,018 కాన్పులు నిర్వహించగా.. వీటిలో 3,879 సాధారణ కాన్పులు, 3,139 ఆపరేషన్లు నిర్వహించినట్లు చెప్పారు. మొత్తం 4,526 మందికి కేసీఆర్ కిట్లను అందజేశామన్నారు. మెరుగైన వైద్య సదుపాయం కోసం మెడికల్ కళాశాల ఏర్పాటు చేశామని, 150 మంది విద్యార్థులతో తరగతులు ప్రారంభమయ్యాయని చెప్పారు.

సాగునీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యం..

జిల్లాలో వ్యవసాయ రంగ అభివృద్ధికి సాగునీటి ప్రాజెక్టుల ఏర్పాటుకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు కలెక్టర్ వివరించారు. మహాత్మాగాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం కింద ఈ ఏడాది 22.70 టీఎంసీలు, గత నాలుగేళ్లలో 197.40 టీఎంసీల నీటిని ఎత్తిపోసినట్లు చెప్పారు. జిల్లాలోని అచ్చంపేట, ఉప్పునుంతల మండలాల్లోని 15 వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు రూ.107.20 కోట్ల మంజూరుకు అనుమతి ఇచ్చినట్లు తెలిపారు. పులిజాల నుంచి చంద్రసాగర్ చెరువు వరకు 15 కి.మీ మేర బ్రాంచ్ కెనాల్ నిర్మాణం చేపట్టనున్నట్లు వెల్లడించారు. మార్కండేయ ఎత్తిపోతల పథకంలో భాగంగా రూ.76.95 కోట్లతో 7,310 ఎకరాలకు సాగునీరు అందించేందుకు భూసేకరణ పనులు కొనసాగుతున్నాయని వివరించారు. 2022– 23 ఏడాదిలో వానాకాలానికి సంబంధించి 221 వరి కొనుగోలు కేంద్రాల ద్వారా 11.73 లక్షల క్వింటాళ్ల ధాన్యాన్ని సేకరించామని చెప్పారు. గొర్రెల పెంపకంలో భాగంగా జిల్లాలో 19 వేల గొర్రెల యూనిట్లను 75 శాతం సబ్సిడీతో అందించామన్నారు. అలాగే 3.04 లక్షల గొర్రెలకు నీలి నాలుక వ్యాధి నివారణ టీకాలు ఇచ్చినట్లు పేర్కొన్నారు.

'గిరిపోషణ'తో చెంచులకు పౌష్టికాహారం..

గిరిపోషణ పథకంలో భాగంగా జిల్లాలోని 55 గ్రామాల పరిధిలో మొత్తం 1,716 మంది చెంచు, గిరిజనులకు ఐటీడీఏ మన్ననూర్, ఇక్రిశాట్ ఆధ్వర్యంలో పౌష్టికాహారాన్ని అందజేస్తున్నట్టు చెప్పారు. ఐటీడీఏ, ఆర్టీటీ సహకారంతో చెంచులకు 102 ఇళ్లను మంజూరు చేశామన్నారు. అచ్చంపేటలో 118 మంది గిరిజన అభ్యర్థులకు పోలీస్, గ్రూప్స్ పరీక్షల కోసం శిక్షణ ఇవ్వడంతో 53 శాతం మంది ప్రిలిమినరీ పరీక్షలకు ఉత్తీర్ణత సాధించినట్టు వివరించారు. గవర్నర్ కోటా కింద అప్పాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో చెంచు పెంటలకు రూ.49.90 లక్షలతో సెమీ పర్మనెంట్ మల్టీపర్పస్ షెడ్ నిర్మాణం, సిమెంట్ బెంచీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దేశంలో ఐదో అతిపెద్ద అభయారణ్యంగా పేరుగాంచిన అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ పరిధిలో 2022 సంవత్సరానికి పెద్దపులుల సంఖ్య 24కు పెరిగిందని, సుమారు 118 చిరుతపులులు, 300 పైగా పక్షులను గుర్తించినట్టు వివరించారు. జిల్లాలో పర్యాటక అభివృద్ధికి రూ.10 కోట్లతో ఉమామహేశ్వరం దేవస్థానం వద్ద అతిథి గృహాలు, రెస్టారెంట్లు, భక్తులకు మెట్ల సౌకర్యం కల్పించినట్టు తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణలో జిల్లా పోలీస్‌శాఖ ముందు వరుసలో ఉందని చెప్పారు. ఉప్పునుంతల పోలీస్ స్టేషన్ రాష్ట్ర స్థాయిలో 2వ ర్యాంక్, అమ్రాబాద్ పోలీస్ స్టేషన్‌కు రాష్ట్ర స్థాయిలో 5వ ర్యాంకు, కల్వకుర్తి స్టేషన్‌కు రాష్ట్ర స్థాయిలో 6వ ర్యాంకు సాధించినట్టు వివరించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు మనుచౌదరి, మోతీలాల్, జెడ్పీటీసీలు రోహిణి, సుమిత్ర, రాంబాబు నాయక్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



స్వాతంత్ర్య సమరయోధురాలు అంబటి నీలావతిని సత్కరిస్తున్న ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు, జెడ్పీ చైర్‌పర్సన్ శాంతాకుమారి, కలెక్టర్ ఉదయ్‌కుమార్



జెండాకు వందనం చేస్తున్న పోలీసులు

రెపరెపలాడిన మువ్వన్నెల జెండా

- జిల్లా వ్యాప్తంగా ఘనంగా 74వ గణతంత్ర వేడుకలు
- జిల్లా పరిషత్ కార్యాలయంలో జెడ్పీ చైర్‌పర్సన్ శాంతాకుమారి జాతీయ జెండా ఆవిష్కరణ

కందనూలు: 74వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం జిల్లా వ్యాప్తంగా జెండా పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఊరువాడలో త్రివర్ణ పతాకం రెపరెపలాడింది. జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో జెడ్పీ చైర్‌పర్సన్ శాంతాకుమారి జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడారు. రాజ్యాంగ రచనకు కృషి చేసిన మేధావుల సేవలను కొనియాడారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలతో పాటు ఎస్పీ కార్యాలయం, ఆబ్కారీ శాఖ కార్యాలయం, ఆర్డీఓ కార్యాలయం, ఆర్టీసీ డిపో, డీటీఓ, ఐసీడీఎస్, సఖీ కార్యాలయంతో పాటు, మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కల్పన ఆధ్వర్యంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. మువ్వన్నెల జెండాకు సెల్యూట్ చేసి, రాజ్యాంగం అమలు, దానితో కలిగే లబ్ధి గురించి వక్తలు సందేశం ఇచ్చారు.

బీజేపీ ఆధ్వర్యంలో ...

పట్టణంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా నాయకులు జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దేశం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుల సేవలను స్మరించుకున్నారు. నాయకులు రాజవర్ధన్‌రెడ్డి, సుధాకర్ రెడ్డి, చందు, మహిళా నాయకులు తదితరులు పాల్గొన్నారు.



జిల్లా పరిషత్ కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న జెడ్పీచైర్‌పర్సన్ శాంతాకుమారి


కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో..

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి నివాసంలో జాతీయ జెండా ఎగురవేశారు. కార్యక్రమంలో డీసీసీ ప్రసిడెంట్ వంశీకృష్ణ, నాగం శశీధర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి అర్థం రవి, నాయకులు పాండు, ఎండీ నిజాం, కొత్తగంగాధర్ పాల్గొన్నారు. జనసేన పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు వంగ లక్ష్మణ్ గౌడ్ నాయకులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి

– ఎస్పీ మనోహర్

నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు సిబ్బంది నిరంతరం పాటుపడాలని ఎస్పీ మనోహర్ అన్నారు. 74వ భారత గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా సాయుధదళ బలగాల కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం మాట్లాడారు. జిల్లాలో పోలీసు శాఖకు మంచిపేరు తీసుకొచ్చేలా ప్రతిఒక్కరూ కష్టపడి పని చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ రామేశ్వర్, ఎఆర్ఏఎస్పీ భరత్, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐ పాల్గొన్నారు.



జాతీయ జెండాను ఎగుర వేస్తున్న ఎస్పీ మనోహర్

ఉత్తమ అవార్డు గ్రహీతలు వీరే..

నాగర్‌కర్నూల్ క్రైం: విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన పలువురు జిల్లా అధికారులతో పాటు సిబ్బందికి కలెక్టర్ ఉదయ్‌కుమార్, ఎస్పీ మనోహర్, జెడ్పీ చైర్‌పర్సన్ శాంతకుమారి, ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు చేతులమీదుగా ప్రశంసా పత్రాలు అందజేశారు.



మనుచౌదరి, అదనపు కలెక్టర్



రోహిత్, డీఎఫ్ఓ



డా.సుధాకర్‌లాల్, డీఎంహెచ్ఓ



సీతారాం, డీపీఆర్ఓ



నర్సింగరావు, డీఆర్‌డీఓ



అనిల్ ప్రకాష్, డీబీసీడీఓ



విజయ్‌కుమార్, ఎస్ఐ



వెంకటేశ్వర్లు, కానిస్టేబుల్



మత్రునాయక్, ఎస్పీ పీఆర్ఓ



తరంగిణి, హెచ్‌డబ్ల్యూఓ



యాదగిరి, హెల్త్ అసిస్టెంట్



విజయలక్ష్మి, షీ టీం ఇన్‌చార్జ్



పాష, డిపిఆర్ఓ ఆఫీస్



శ్రీను, డీపీఆర్ఓ ఆఫీస్



రఘు, కలెక్టరేట్



శేఖర్, మున్సిపాలిటీ

వైభవంగా వసంత పంచమి

కందనూలు: జిల్లా కేంద్రంలోని కొల్లాపూర్ చౌరస్తా సమీపంలోని శ్రీజ్ఞాన సరస్వతి దేవాలయ వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా 5వ రోజు వసంత పంచమి పురస్కరించుకుని అమ్మవారి జన్మదినోత్సవ కార్యక్రమాలు ఆలయంలో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వసంత పంచమి రోజు అమ్మవారిని దర్శించిన, సేవ చేసిన, ప్రత్యేక పూజలు నిర్వహించిన, విశేష ఫలితం ఉంటుందని ఆలయ ప్రధాన అర్చకులు పి.నవీన్ కుమార్ తెలిపారు. ఆలయంలో వసంత పంచమి రోజు సందర్భంగా విశేషంగా 300 మందికి పైగా చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమాలు, పలువురికి అన్నప్రాసన కార్యక్రమాలు, భక్తులకు అర్చనలు, వేద మంత్రోచ్ఛరణల మధ్య నిర్వహించినట్లు తెలిపారు. పలు పాఠశాలల విద్యార్థులు అమ్మవారిని దర్శించుకున్నారని చెప్పారు. ఆలయంలో దర్శించుకున్న భక్తులకు, అక్షరాభ్యాసం చేసిన కుటుంబాలు మొత్తానికి దేవాలయ కమిటీ వారిచే ఉచిత అన్నప్రసాద పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

అదనపు మీటర్లకు చెక్

- ఒక వంట గదికి ఒకటే
- అదనపు మీటర్లు తొలగించేందుకు విద్యుత్‌శాఖ సన్నద్ధం
- జిల్లాలో 1,91,347 డొమెస్టిక్ మీటర్లు
- సుమారు రూ.10 వేలకు పైగా అదనపు మీటర్లు ఉంటాయని అంచనా
- సమాచారం సేకరిస్తున్న సిబ్బంది



అచ్చంపేట: ఒక వంట గదికి ఒకటే విద్యుత్ మీటర్ నిబంధన అమలు చేసేందుకు విద్యుత్‌శాఖ సన్నద్ధం అవుతోంది. ఇప్పటికే జిల్లాలో అదనంగా ఉన్న విద్యుత్ మీటర్ల సమాచారాన్ని విద్యుత్ సిబ్బంది రీడింగ్ సమయంలో సేకరిస్తున్నారు. కొత్త నిబంధనల మేరకు రెండు పడకల గదులు, హాలు, వంట గది, మోటారు ఉన్న ఇంటికి ఒకటే విద్యుత్ మీటరు ఉండాలి. అంతస్తు ఉండి ఇల్లు అద్దెకు ఇస్తే అందులోనూ వేర్వేరు వంట గదులు ఉండాలి. అలా ఉంటేనే అదనపు మీటరుకు అనుమతి ఉంది. దీంతో పాటు మోటారు కనెక్షన్ సైతం ఇంటి మీటరులోనే ఉండాలి. ఈ నిబంధలకు విరుద్ధంగా ఉంటే అధికారులు తొలగిస్తారు.

ఆదాయం, వినియోగం మధ్య వ్యత్యాసం..

నాగర్‌కర్నూల్ జిల్లాలో 1,91,347 గృహ విద్యుత్ వినియోగదారులు ఉన్నారు. ఇందులో సుమారుగా 10 వేలకు పైగా అదనపు మీటర్లు ఉండొచ్చని ప్రస్తుత సర్వే అంచనా ప్రకారం తెలుస్తోంది. దీంతో అదనపు మీటర్ల రీడింగ్ తీయగా ఒక్కో మీటరకు రూ.1,500 నుంచి రూ.2 వేల వరకు బిల్లు వస్తున్నట్లు సిబ్బంది గుర్తించారు. దీంతో సంస్థకు స్లాబ్ ప్రకారం బిల్లింగ్‌లో జిల్లాలో నెలకు రూ.కోటిన్నర నుంచి రూ.2కోట్ల వరకు ఆదాయం నష్టపోతున్నట్లు తెలుస్తోంది. అదే ఒకే మీటరు కింద ఉంటే రీడింగ్ పెరిగి స్లాబ్ రేటు రూ.7 నుంచి రూ.8 వరకు పెరగడంతో ఆదాయం రూ.కోట్లలో పెరుగుతుంది. విద్యుత్ శాఖ రెవెన్యూకు, విద్యుత్ వినియోగానికి ఉన్న వ్యత్యాసాన్ని సరిచేసేందుకు ఈ చర్యలు చేపడుతుంది. అందులో భాగంగానే ఒక వంటగది ఉన్న ఇంటికి ఒకటే మీటరు పద్ధతిని కఠినంగా అమలు చేయనున్నట్లు తెలుస్తోంది.

మొదట నోటీసులు జారీ..

ఒకే ఇంటికి రెండు, మూడు మీటర్లు ఉంటే స్వచ్ఛందంగా తొలగించుకోవడానికి విద్యుత్‌శాఖ అధికారులు మొదటగా నోటీసులు జారీ చేస్తారు. 15 రోజుల గడువు తరువాత సిబ్బంది వచ్చి వాటిని తొలగిస్తారు. అయితే ఒకటే మీటరు వ్యవస్థ పూర్వం నుంచి ఉన్నా.. రాజకీయం, తదితర వర్గాల పైరవీలతో అమలు కాలేదని, ఇక నుంచి ఈ పద్ధతిని అమలు చేయడంతో పాటు మీటరు లేకుండా ఏ ఇంటికి సర్వీస్ ఇవ్వకూడదని ఉన్నతాధికారులు కింది స్థాయి సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. కాగా.. ఎన్ని మీటర్లు ఉన్నా.. విద్యుత్ వినియోగం మేరకు స్లాబ్ ప్రకారం వచ్చే బిల్లులను మాత్రం తాము చెల్లిస్తున్నామని, విద్యుత్ చౌర్యానికి ఎవరూ పాల్పడటం లేదని వినియోగదారులు పేర్కొంటున్నారు. గతంలో ఈ విధానాన్ని అమలు చేసేందుకు పైలెట్ ప్రాజెక్టు కింద రాష్ట్ర వ్యాప్తంగా కొన్ని పట్టణాలను ఎంపిక చేసుకుని ప్రయత్నించగా.. ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో అప్పుడు దానిని తాత్కాలికంగా నిలిపివేశారు. ఇప్పుడు తిరిగి ఈ విధానాన్ని అమలు చేసేందుకు విద్యుత్‌శాఖ సన్నద్ధం అవుతోంది. దీనిపై ప్రజల స్పందన ఎలా ఉంటుందో వేచి చూడాలి.

చేంజ్ ఓవర్ ఏర్పాటు చేసి..

ఒకే ఇంటిలో రెండు మీటర్లు పెట్టి చేంజ్ ఓవర్ ఏర్పాటు చేసి విద్యుత్ వాడుకునేలా వినియోగదారులు ఏర్పాటు చేసుకున్నారు. దీంతో వినియోగదారులకు ఊరట లభిస్తుంది. కానీ విద్యుత్‌శాఖకు ఆదాయం భారీగా తగ్గుతుంది. ఉదాహరణకు నెలకు దాదాపు 200 యూనిట్లు వినియోగం ఉంటుందనుకునే వారు రెండు మీటర్లు పెడుతున్నారు. తద్వారా ఒక్కో మీటరు కింద 100 యూనిట్లు వినియోగానికి బిల్లు మొదటి స్లాబ్ రేటులోనే ఉంటుంది. అదే ఒక మీటరుకు 200 యూనిట్లు వాడితే నాలుగో స్లాబ్ రేటులో బిల్లు రూ.వేల్లో వస్తుంది. అందుకే కొందరు వినియోగదారులు రెండు మీటర్లు పెట్టుకుని చేంజ్ ఓవర్ ఏర్పాటు చేసుకుంటున్నారు. ఒక మీటరులో 50 యూనిట్లు వాడకం పూర్తికాగానే వెంటనే ఈ చేంజ్ ఓవర్‌తో ప్రస్తుత మీటరు నుంచి విద్యుత్ వాడకం ఆపేసి మరో మీటరు నుంచి విద్యుత్ వాడుతున్నారని విద్యుత్ శాఖ అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలోనే అదనపు మీటర్లు తొలగించి ఒక వంట గదికి ఒకే మీటరు అన్న నినాదాన్ని తీసుకొచ్చారు.

అమలు చేయాల్సి ఉంది..



ఒక వంట గది ఉండే ఇంటికి ఒకటే మీటరు నిబంధన వచ్చి చాలా కాలం అవుతోంది. చాలా ఇళ్లలో రెండు, మూడు మీటర్లు ఉన్నాయి. ఇలాంటి వాటిని తొలగించాల్సి ఉంది. పెద్దపట్టణాల్లో దీని అమలు చేస్తున్నారు. ముందుగా నోటీసులు ఇచ్చి ఇక్కడ కూడా అమలు చేయాల్సి ఉంది. ఇదీ అమలు చేస్తే ట్రాన్స్‌కోకు మరింత ఆదాయం పెరుగుతోంది.

– శ్రీనివాసులు, ట్రాన్స్‌కో, ఏఈ కల్వకుర్తి

పంటల రక్షణకు సోలార్ కంచె



సోలార్ సెట్టును అందజేస్తున్న ఎఫ్‌డీఓ విశాల్

మన్ననూర్: వ్యవసాయ పంటల రక్షణ కోసం అటవీశాఖ తరఫున రైతులకు సోలార్ కంచెను అమ్రాబాద్ డివిజన్ ఎఫ్‌డీఓ విశాల్ చేతులమీదుగా రైతుకు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అటవీ సమీపంలో వ్యవసాయ పంటలను వన్యప్రాణులు నాశనం చేస్తున్నాయని రైతులు తరుచుగా అటవీశాఖ అధికారులు, సిబ్బందితో వివాదాలు చేస్తున్నారు. దీంతో వన్యప్రాణుల బెడదను తగ్గించడానికి ఈ సోలార్ కంచెను ఉపయోగంగా ఉంటుందని డీఎఫ్ఓ రోహిత్ రెడ్డి ఆలోచన మేరకు పైలెట్ ప్రాజెక్టుగా మొదటి విడత తుర్కపల్లికి చెందిన ఎనుపోతుల నారాయణకు అందజేశారు. కంచెకు వన్యప్రాణి తగిలినప్పుడు స్వల్పంగా షాక్ వస్తుంది. దీంతో భయాందోళనకు గురైన జంతువులు ఆ ప్రాంతానికి తిరిగి రాకుండా ఉంటాయన్నారు.

క్లుప్తంగా

చెరువులో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం



బీసయ్య(ఫైల్)

అమ్రాబాద్: చేపల వేటకు వెళ్లి చెరువులో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యమైంది. మండలంలోని మాచారాం కాలనీకి చెందిన ఉడ్తనూరి బీసయ్య(41) బుధవారం మధ్యాహ్నాం తన తమ్ముడు సైదులు, మరో ముగ్గురితో కలిసి సమీపంలోని పెద్ద చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లారు. చేపలు పట్టిన అనంతరం తమకంటే ముందుగానే వచ్చిన బీసయ్య కాళ్లు శుభ్రం చేసుకునేందుకు వెళ్లి చెరువులో గల్లంతయ్యాడు. చెరువులోనే మునిగి ఉండవచ్చనే అనుమానంతో గ్రామస్తులు, పోలీసులు రాత్రి వరకు గాలించారు. ఆచూకి లభించలేదు. గురువారం పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది చెరువులో గాలించడంతో బీసయ్య మృతదేహం లభ్యమైంది. పోలీసులు కేసు నమోదు చేశారు. మృతుడికి భార్య అరుణ, ముగ్గురు కూతుర్లు ఉన్నారు.

బాత్‌రూంలో జారిపడి యువకుడు మృతి



రమేష్ (ఫైల్)

అచ్చంపేట రూరల్: బాత్‌రూంలో యువకుడు జారి పడి మృతి చెందిన సంఘటన గురువారం ఉదయం పట్టణంలోని రాజీవ్‌నగర్ కాలనీలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం.. కాలనీలో నివాసం ఉంటున్న బండారు రమేష్(33) నాగర్‌కర్నూల్‌లో మొబైల్ షాపు నడుపుతున్నాడు. గురువారం ఉదయం బాత్‌రూంకు వెళ్లిన అతను అకస్మాత్తుగా జారి పడి అపస్మారక స్థితికి చేరాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు హైదరాబాద్ తీసుకెళ్లాలని చెప్పగా, మార్గమధ్యలోనే మృతి చెందాడు. భార్య బండారు సరస్వతీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

నాగర్‌కర్నూల్ క్రైం: కుటుంబ కలహాలతో ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన జిల్లా కేంద్రంలో గురువారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ విజయ్‌కుమార్ వివరాల మేరకు.. పెద్దకొత్తపల్లి మండలం చంద్రకల్ చెందిన గన్నోజు కొండయ్య (48) జిల్లాకేంద్రంలో వెల్డింగ్ పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. గురువారం ఉదయం భార్యతో గొడవ పడి క్షణికావేశానికి గురై కొల్లాపూర్ క్రాస్‌రోడ్డు సమీపంలో చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటనస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. మృతుడి తమ్ముడు రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వ్యవసాయ మోటార్ చోరీ

- మనస్తాపంతో రైతు ఆత్మహత్య

నవాబుపేట: వ్యవసాయ మోటార్‌ను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లడంతో మనస్తాపంతో రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. మండలంలోని కొల్లూర్‌కు చెందిన వడ్డె లక్ష్మయ్య(52) బుధవారం తన వ్యవసాయ పొలంలో వరి చేనుకు నీరు పెట్టేందుకు బోరు మోటార్ వద్దకు వెళ్లాడు. అప్పటికే దాన్ని ఎత్తుకెళ్లారు. దీంతో మనస్తాపం చెంది పొలం వద్దనే ఉన్న పురుగు మందు తాగి అపస్మారక స్థితిలో పడిపోయాడు. పక్క పొలం వారు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వెంటనే ఆయనను జిల్లా ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుడి కుమారుడు నగేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పురుషోత్తం తెలిపారు.

ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో వృద్ధురాలి మృతి

నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో భోజనం చేస్తున్న వృద్ధురాలు అకస్మాత్తుగా మృతి చెందింది. ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాలు.. బిజినేపల్లి మండలం సల్కర్‌పేటకు చెందిన శంకరమ్మ (70) తన మనవరాలు ఆస్పత్రిలో ప్రసవించంతో చూసేందుకు గురువారం వచ్చింది. ఆస్పత్రి ఆవరణలో భోజనం చేస్తుండగా అకస్మాత్తుగా మృతి చెందింది. మృతురాలి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

చెట్టుపై నుంచి పడి వ్యక్తి మృతి

భూత్పూర్: మండలంలోని కర్వెన చెందిన బీర్ల మల్లేష్ (42) గురువారం చికిత్స పొందుతూ ఆస్పత్రిలో మృతి చెందినట్లు ఎస్‌ఐ విజయ్‌భాస్కర్ తెలిపారు. బీర్ల మల్లేష్ గ్రామానికి సమీపంలో గల ఓ రైతు పొలంలో ఉన్న చింతచెట్టును మంగళవారం సాయంత్రం ఎక్కాడు. చెట్టుపై ఉన్న తేనేటీగలు ఒక్కసారిగా గుంపుగా లేవడంతో భయపడి చెట్టు నుంచి దిగే క్రమంలో పైనుంచి కిందపడిపోయాడు. ఆయనను చికిత్స నిమిత్తం హైదరాబాద్ తరలించారు. గురువారం మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడి సోదరుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఉప్పొంగిన దేశభక్తి







మహబూబ్‌నగర్ కలెక్టరేట్‌లో దేశభక్తి గీతాలకు విద్యార్థుల నృత్య ప్రదర్శన



పాలమూరులో స్వాతంత్ర్య సమరయోధులను సత్కరిస్తున్న అధికారులు



నవాబుపేటలో చిన్నారుల కోలాటం





వేషధారణలో విద్యార్థులు





మహబూబ్‌నగర్ కలెక్టరేట్‌లో విద్యార్థుల నృత్య ప్రదర్శన







ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రిపబ్లిక్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థలు, వివిధ రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు వేడుకల్లో పాల్గొని జాతీయ జెండాను ఎగురవేశారు. ఆయా జిల్లాల కలెక్టరేట్‌ల వద్ద కలెక్టర్లు, ఎస్పీ కార్యాలయాల వద్ద ఎస్పీలు గౌరవ వందనం స్వీకరించి జాతీయ జెండాను ఎగురవేశారు. ఆయా పాఠశాలల్లో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాలకు రిజర్వేషన్ ఫలితాలు అందుతున్నాయంటే అది డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కృషి అని తెలిపారు. రాజ్యాంగ విలువలను అందరూ పాటించాలని, ప్రతి ఒక్కరూ హక్కులతో పాటు బాధ్యతతో మెలగాలన్నారు. రాజ్యంగ ఫలాలు ప్రజలకు అందేందుకు ఉద్యోగులు కృషి చేయాలన్నారు. రాజ్యాంగాన్ని గౌరవించుకోవడం ప్రతి ఒక్కరి విధి అని తెలిపారు. – సాక్షి నెట్‌వర్క్





మహబూబ్‌నగర్‌లో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

ధరూరు వైఎస్సార్ చౌరస్తాలో



శాంతినగర్‌లో విద్యార్థుల ప్రదర్శన

భూగర్భ కేంద్రం వందేళ్లు పనిచేయాలి



ఈగలపెంటలో ఎస్‌పీఎఫ్ పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న కేంద్రం సీఈ

దోమలపెంట(అచ్చంపేట): దేశంలో ఏ విద్యుత్ కేంద్రంకు లేని కీర్తి శ్రీశైలం ఎడమగట్టు భూగర్భ కేంద్రానికి ఉందని, దీన్ని వందేళ్ల పనిచేసేలా తీర్చిదిద్దుదామని చీఫ్ ఇంజినీర్ బీ.సూర్యనారాయణ అన్నారు. గురువారం గణతంత్ర దినోత్సవం పురస్కరించుకుని ఈగలపెంటలోని శక్తి సదన్‌లో అయన జాతీయ జెండాను ఎగురవేసి ఇంజినీర్లను, ఉద్యోగులు, కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోని విద్యుత్ కేంద్రాలతో పాటు దేశంలోని కొన్ని ముఖ్య కేంద్రాలను చూశానన్నారు. కానీ ఎక్కడికి వెళ్లిన భూగర్భ కేంద్రానికి మాత్రమే కీర్తి ఉందన్నారు. కేంద్రం రానున్న రోజుల్లో జాతికి విశిష్ట సేవలందించేలా తీర్చిదిద్దుదామన్నారు. రాబోయే రోజుల్లో విద్యుత్ అవసరాలు మరింతగా పెరుగుతాయన్నారు. కేంద్రంలోని 4వ యూనిట్ పునరుద్ధరణలో సాంకేతిక సిబ్బంది అశోక్ శ్రమిస్తున్న తీరును, ఇంజినీర్లు అస్వస్థతకు లోనైనప్పుడు జెన్‌కో డాక్టర్ రవీంద్రబాబు వైద్యసేవలతోపాటు స్ఫూర్తి కలిగించేలా ధైర్యం తెలియపరచడం అభినందనీయమన్నారు. అందరం సమష్టిగా కష్టపడి అతి త్వరలో 4వ యూనిట్‌ను పునరుద్ధరించి కేంద్రం తిరిగి పూర్తిస్థాయిలో 900 మెగావాట్లతో విద్యుదుత్పత్తి చేసేలా తీర్చిదిద్దుదామన్నారు. అంతకుముందు అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. ఎస్‌పీఎఫ్ ఆర్‌ఐ శ్రీధర్‌రెడ్డి పర్యవేక్షణలో ఎస్‌ఐ ఏపీ.రావు ఆధ్వర్యంలో పోలీసుల నుంచి గౌరవ వందన స్వీకరించారు.

జాతీయ జెండాకు నిప్పు

కొత్తకోట రూరల్ (పెద్దమందడి): మండలంలోని మనిగిళ్ల ప్రాథమిక పాఠశాలలో గురువారం గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎగురవేసిన జాతీయ జెండాకు అవమానం జరిగింది. జెండావిష్కరణ అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థులు ఇళ్లకు వెళ్లారు. మధ్యాహ్నం 12గంటల సమయంలో జెండా తగలబడుతున్న విషయాన్ని గ్రామస్తులు గుర్తించారు. వెంటనే ఫోన్ ద్వారా హెచ్‌ఎం జ్యోతికి సమాచారం అందించారు. సమాచారం అందుకున్న హెచ్‌ఎం స్కూల్ దగ్గరకు వచ్చి చూడగా జెండా కర్రతో పాటు కర్రకు చుట్టిన పేపర్స్, జెండా పూర్తి కాలిపోయాయి కింద పడింది. ప్రమాదవశాత్తు తగులబడిందా, లేక కావాలనే ఎవరైనా జెండాను తగులబెట్టారా అనే అనుమానంతో హెచ్‌ఎం, గ్రామస్తులతో కలిసి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ హరిప్రసాద్ తెలిపారు.



మనిగిళ్ల పాఠశాలలో తగలబడిన జాతీయ జెండా కర్ర

అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి



మక్తల్‌లో అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే చి ట్టెం రామ్మోహన్‌రెడ్డి

మక్తల్: అంబేద్కర్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలో గురువారం రాత్రి అంబేద్కర్ చౌరస్తాలో అంబేద్కర్ కాంస్య విగ్రహాన్ని ఎమ్మెల్యే రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ సాయిచంద్, ప్రొఫెసర్ కాశీం చేతుల మీద ఆవిష్కరించారు. అంతకుముందు పట్టణంలో భారీ ర్యాలీ చేపట్టారు. అక్కడి నుంచి మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన సభలో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు మాట్లాడారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పావని, సభాధ్యక్షుడు కోరిమారెప్ప, కౌన్సిలర్లు రాములు, మొగులప్ప, శంకరమ్మ, వెంకటేష్, మద్దిలేటి, పోలప్ప, నారాయణ, ఎంఈఓ లక్ష్మీనారాయణ, ప్రశాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నా మతం వేరు.. జెండా ఎగురవేయను..

ఓ అంగన్‌వాడీ టీచర్ నిర్వాకం



పల్లెగడ్డలో జెండాను ఎగరవేస్తున్న ఆయా వెనకలే ఉన్న అంగన్‌వాడీ టీచర్

మరికల్: నారాయణపేట జిల్లా మరికల్ మండలం పల్లెగడ్డ అంగన్‌వాడీ కేంద్రం వద్ద జాతీయ జెండా ఎగురవేయనని ఆ కేంద్రం అంగన్‌వాడీ టీచర్ ఏస్తేర్ గ్రామస్తులతో వాగ్వివాదానికి దిగింది. గణతంత్ర వేడుకల్లో భాగంగా డాక్టర్ అంబేద్కర్, మహాత్మాగాంధీ చిత్రపటాలను పూజ చేసి జెండాను ఆవిష్కరించాలని సర్పంచ్‌తో పాటు గ్రామస్తులు అంగన్‌వాడీ టీచర్‌కు సూచించారు. తన మతం వేరని, పూజలు చేయనని, జెండా ఎగురవేయనని తేల్చి చెప్పారు. చేసేది లేక గంట తర్వాత అంగన్‌వాడీ ఆయా చంద్రమ్మతో జెండాను ఆవిష్కరణ చేయించారు. ఆమెపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు.

కనుల పండువగా అంజన్న రథోత్సవం

వేలాదిగా తరలి వచ్చిన భక్తులు



ఆంజనేయస్వామి రథానికి పూజలు చేస్తున్న భక్తులు

ధరూరు: మండలంలోని పెద్దచింత రేవుల ఆంజనేయ స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు కనుల పండువగా నిర్వహిస్తున్నారు. మంగళవారం అంకురార్పణ, ధ్వజారోహణం కార్యక్రమంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం కాగా గురువారం స్వామి వారి రథోత్సవం ఘనంగా చేపట్టారు. ఆలయం వద్ద నుంచి దశమికట్ట వరకు రథాన్ని లాగారు. శ్రీ ఆంజనేయం, ప్రసన్నాంజనేయం అంటూ నినాదాలు చేస్తూ భక్తులు భక్తి పారవశ్యంతో ముందుకు కదిలారు. బ్రహ్మోత్సవాలకు ఆయా ప్రాంతాల నుంచి వేలాదిగా తరలి వచ్చి ప్రత్యేక పూజలు చేశారు.

నిద్రిస్తుండగా గొంతుకోసి హత్య

భార్యపైనే అనుమానం

నవాబుపేట: నిద్రిస్తున్న వ్యక్తి గొంతుకోసి హత్య చేసిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల తెలిపిన వివరాలు ఇలా.. మండలంలోని యన్మన్‌గండ్లలో కోస్గి శివయ్య(48) ఆయన ఇంట్లోనే తెల్లవారుజామున హత్యకు గురయ్యాడు. భార్యకు వివాహేతర సంబంధం ఉందన్న అనుమానంతో తరుచూ గొడవ పడేవారని పోలీసులు తెలిపారు. బుధవారం సైతం గొడవ అయ్యిందని అందరూ ఇంట్లో నిద్రించగా తెల్లవారు జామునే ప్రతి రోజు లేచే అలవాటు ఉన్న శివయ్య నిద్ర లేవకపోవటంతో పెద్ద కుమారుడు వచ్చి చూడగ రక్తం మడుగులో కనిపించాడు. పక్కనే ఉన్న తన బాబాయికి విషయం తెలిపి, పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడి భార్య సత్యమ్మపైనే అనుమానం ఉందంటూ మృతుడి సోదరుడు కోస్గి నర్సింహులు ఫిర్యాదు చేశాడు. ఎస్‌ఐ పురుషోత్తం సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. కుటుంబ సభ్యుల ఆరోపణలకు, డాగ్ స్క్వాడ్ ఇచ్చిన ఆధారాలు సైతం దగ్గర పోలికలు ఉండటంతో భార్యనే హత్య చేసి ఉంటుందన్నా విషయంలో పోలీసులు విచారణ చేపట్టారు. మృతుడికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

చెరుకు పంట దగ్ధం

అలంపూర్ రూరల్: మండలంలోని కోనేరు చెందిన చిన్న కృష్ణయ్య ఎకరా చెరుకు పంట బుధవారం రాత్రి అగ్నికి ఆహుతైంది. చేతికి వచ్చిన పంట ప్రమాదవశాత్తు కాలిపోయిందని రైతు వాపోయాడు. సుమారు రూ.2 లక్షల వరకు నష్టం వాటిల్లిందని తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారులు పరిశీలించారని చెప్పారు. గురువారం ఉదయం బీఎస్పీ నాయకులు పరిశీలించి, బాధిత రైతుకు ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

కట్టెల దుకాణంలో చోరీ

అచ్చంపేట రూరల్: పట్టణంలోని ఉప్పునుంతల రోడ్డులో కట్టెల దుకాణంలో రూ.70వేలు చోరీ చేసినట్లు బాధితుడు మణెయ్య తెలిపారు. రోజూ మాదిరిగా దుకాణం మూసేసి ఇంటికి వెళ్లాడు. గురువారం ఉదయం దుకాణం వద్దకు వచ్చి చూడగా చిన్న పెట్టెలో దాచిన డబ్బులు మాయం అయ్యాయని, వెంటనే అచ్చంపేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు.



కర్తవ్యపథ్‌లో అబ్బురపరిచిన కోనసీమ 'ప్రభ'

సాక్షి ,అమలాపురం: రిపబ్లిక్ డే వేడుకల్లో భాగంగా దేశ రాజధాని ఢిల్లీలోని కర్తవ్యపథ్‌లో జరిగిన పరేడ్‌లో ఏపీలోని కోనసీమ ప్రాంతంలోని ప్రబల తీర్థం శకటాన్ని ప్రదర్శించారు. కనుమ పండుగ రోజు జగన్న తోటలో జరిగే ప్రబల తీర్థంను శకటంగా రూపొందించారు. వేడుకల్లో మొత్తం 17 రాష్ట్రాలకు చెందిన శకటాలను ప్రదర్శించగా..అందులో ఏపీ నుంచి ప్రబలతీర్థం ఒకటి కావడం విశేషం.



ఏపీ రాజ్‌భవన్‌లో సందడిగా 'ఎట్ హోమ్'


'ఎట్ హోమ్' కార్యక్రమంలో గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ దంపతులు, సీఎం వైఎస్ జగన్, ఆయన సతీమణి వైఎస్ భారతి, హైకోర్టు సీజే జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా, ఆయన సతీమణి సుచేత మిశ్రా

సాక్షి, అమరావతి: గణతంత్ర దినోత్సవం సందర్భంగా విజయవాడలోని రాజ్‌భవన్‌లో 'ఎట్ హోమ్' కార్యక్రమం గురువారం సందడిగా జరిగింది. ఏటా గణతంత్ర దినోత్సవం రోజున ప్రముఖులకు గవర్నర్ తేనీటి విందు ఇవ్వడం సంప్రదాయంగా వస్తోంది. దీన్ని అనుసరించి గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ రాజ్‌భవన్‌లో గురువారం 'ఎట్ హోమ్' కార్యక్రమం నిర్వహించారు. గవర్నర్ దంపతులు, సీఎం వైఎస్ జగన్, ఆయన సతీమణి వైఎస్ భారతి, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, ఆయన సతీమణి సుచేత మిశ్రా ఒకే చోట ఆసీనులై రాజ్‌భవన్ ఆతిథ్యాన్ని స్వీకరించారు. పలు అంశాలపై వారు సరదాగా మాట్లాడుకోవడం అందరి దృష్టిని ఆకర్షించింది. ప్రతిపక్ష నేత చంద్రబాబు సహా టీడీపీ, బీజేపీ, జనసేన, వామపక్ష పార్టీల ప్రతినిధులు 'ఎట్ హోమ్' కార్యక్రమానికి గైర్హాజరయ్యారు.

ఎక్కడికక్కడ గొడవలకు దిగండి

- ఎలాగైనా సరే లోకేశ్ పాదయాత్రకు హైప్ తేవాలి
- వైసీపీ నేతలు, పోలీసులు, ట్రాఫిక్ ఆంక్షలు.. ఏదో ఓ కారణం
- 'సాక్షి' విలేకరులను కొట్టినా ఫర్వాలేదు మనకు కావాల్సింది మీడియా ఫోకస్
- సాదాసీదాగా సాగితే ఇతరులెవ్వరూ పట్టించుకోరు
- టీడీపీ శ్రేణులకు చంద్రబాబు సూచన

సాక్షి నెట్‌వర్క్ : 'లోకేశ్ బాబు పాదయాత్రకు పెద్దఎత్తున హైప్ తీసుకురావాలి. సాదాసీదాగా సాగిపోతే మన మీడియా తప్ప ఇతర ఎలక్ట్రానిక్ మీడియా కవరేజీ ఉండదు. వాళ్లు టీఆర్‌పీ రేటింగ్స్ చూసుకుంటారు. అందువల్ల ప్రతిచోటా ఇష్యూ చేయాలి. వైసీపీ వాళ్లు అడ్డుకుంటున్నారనో.. పోలీసులు జనాన్ని రాకుండా నియంత్రిస్తున్నారనో.. ట్రాఫిక్ క్రమబద్ధీకరించలేదనో.. సరైన రక్షణ కల్పించలేదనో.. ఏది వీలైతే దానిమీద గొడవలకు దిగండి.. మనకు కావాల్సింది మీడియా ఫోకస్..' అంటూ చంద్రబాబు చిత్తూరు జిల్లా టీడీపీ నాయకులకు దిశానిర్దేశం చేశారు. శుక్రవారం ప్రారంభం కానున్న లోకేష్ పాదయాత్ర సందర్భంగా చంద్రబాబు గురువారం జిల్లాకు చెందిన ముఖ్యమైన టీడీపీ నాయకులతో టెలీ కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా పలు ఆదేశాలు జారీ చేశారు. 'కవరేజ్ పేరుతో సాక్షి విలేకరులు వస్తే తరిమికొట్టండి. మన వ్యూహాలు, వ్యవహారాలు



కనిపెట్టి బట్టబయలు చేస్తారు. వారి విషయంలో జాగ్రత్తగా ఉండాలి. బెదిరించండి.. కొట్టినా ఫర్వాలేదు.. విలేకరి అని తెలియదు.. అనుమానాస్పదంగా తిరుగుతుంటే పట్టుకొన్నాం.. అని తర్వాత చెప్పుకోవచ్చు' అని నాయకులకు సూచించినట్లు తెలిసింది.

నాయకులపై నమ్మకం లేకే..

లోకేశ్ పాదయాత్ర కోసమని కొన్ని కమిటీలు ఏర్పాటు చేసినప్పటికీ, కీలకంగా వ్యవహరించే ప్రత్యేక టీమ్ ఒకటి మూడు రోజుల క్రితమే చిత్తూరు జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో పర్యటించింది. దాదాపు 500 మంది సభ్యులున్న వీరు గురువారం కుప్పం చేరుకున్నారు. లోకేశ్ కీలక బాధ్యతలన్నీ చంద్రబాబు వారికే అప్పగిస్తుండటంతో స్థానిక నేతలు చిన్నబుచ్చుకున్నారు. తాము గొడ్డుచాకిరీ చేసి, గొడవలకు దిగి కేసుల్లో ఇరుక్కుంటుంటే.. బయట వాళ్లకు పెత్తనం ఇవ్వడమేమిటని అంతర్గతంగా వాపోతున్నారు. లోకేశ్ పాదయాత్ర రూట్‌మ్యాప్ ప్రకారం ముందస్తు ఏర్పాట్లు చేయటంతో పాటు ఎక్కడికక్కడ టీడీపీకి అనుకూలురను సమీకరించి.. నాటకీయ పరిణామాలను సృష్టించేందుకు ఈ టీమ్ ప్లాన్ చేస్తోంది. అయితే, ఆ వ్యవహారాలు ఏమిటనేది పార్టీ ముఖ్య నాయకులకు తప్ప ఇతరులకు తెలియకుండా జాగ్రత్తలు తీసుకున్నట్లు పార్టీ శ్రేణులు చెబుతున్నాయి.

నేడు బంగాళాఖాతంలో అల్పపీడనం!

- సముద్రంలో అధిక తేమ ఉండడమే కారణం
- 29, 30 తేదీల్లో దక్షిణ కోస్తాలో తేలికపాటి వర్షాలు

సాక్షి, విశాఖపట్నం: ఆగ్నేయ బంగాళాఖాతంలో తూర్పు భూమధ్య రేఖా ప్రాంతానికి ఆనుకుని ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. దీని ప్రభావంతో శుక్రవారం అదే ప్రాంతంలో అల్పపీడనం ఏర్పడనుంది. అనంతరం ఈ అల్పపీడనం పశ్చిమ వాయవ్య దిశగా మూడు రోజులపాటు నెమ్మదిగా పయనిస్తుందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) గురువారం రాత్రి నివేదికలో తెలిపింది. ఫలితంగా ఈ నెల 29, 30 తేదీల్లో దక్షిణ కోస్తాంధ్రలో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. సాధారణంగా జనవరి మొదటి వారం తర్వాత బంగాళాఖాతంలో అల్పపీడనాలు అరుదుగా ఏర్పడుతుంటాయి. అంతకుముందే ఈశాన్య రుతుపవనాలు కూడా నిష్క్రమిస్తాయి. దీంతో వర్షాలకు ఆస్కారం ఉండదు. కానీ, ప్రస్తుతం సముద్రంపై తేమ అధికంగా ఉండడం వల్ల ఉపరితల ఆవర్తనం, అల్పపీడనం ఏర్పడడానికి దోహదపడుతోందని విశాఖలోని తుపాను హెచ్చరికల కేంద్రం అధికారులు 'సాక్షి'కి తెలిపారు. మరోవైపు ఏపీలో కనిష్ట ఉష్ణోగ్రతల క్షీణత కొనసాగుతూనే ఉంది. కొద్దిరోజుల నుంచి ఏజెన్సీ ఏరియాతోపాటు రాయలసీమలో రాత్రి ఉష్ణోగ్రతలు అత్యల్పంగా నమోదవుతున్నాయి.

కాంగ్రెస్‌తోనే ప్రజాసంక్షేమం

- టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి
- రాష్ట్రంలో తాగుబోతు పాలన సాగుతోందని ధ్వజం
- వికారాబాద్ జిల్లాలో హాథ్ సే హాథ్ జోడో యాత్ర ప్రారంభం
- రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే వ్యవసాయానికి ఉచిత కరెంటు, రూ.2 లక్షల రుణమాఫీ, 2 లక్షల ఉద్యోగాలిస్తామని హామీ


యాత్రలో మహిళలతో మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి

బొంరాస్‌పేట/సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీతోనే ప్రజా సంక్షేమం సాధ్యమని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలో తాగుబోతు పాలన కొనసాగుతోందని ముఖ్యమంత్రి కేసీఆర్‌పై ధ్వజమెత్తారు. గురువారం ఆయన వికారాబాద్ జిల్లా బొంరాస్‌పేట మండలం మదన్‌పల్లి నుంచి హాథ్‌సే హాథ్ జోడో యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఉచితంగా ఇందిరమ్మ ఇళ్లు, భార్యాభర్తలకు వృద్ధాప్య పింఛన్లు, వ్యవసాయానికి ఉచిత కరెంటు, రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ, 2 లక్షల ఉద్యోగాభర్తీ వంటి హామీలు ఇచ్చారు. ముఖ్యమంత్రి కేసీఆర్ బంగారు తెలంగాణ పేరుతో ధరలు పెంచి పేదలను దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వని సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌లను పదవుల నుంచి తప్పించాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని ప్రజలను కోరారు. వికారాబాద్ జిల్లాలో కొత్తగా ఏర్పడిన దుద్యాల మండల కేంద్రంలో కూడా రేవంత్ యాత్ర కొనసాగింది. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలివచ్చారు.

పార్టీ ఫిరాయిస్తే ఉరి శిక్ష విధించాలి

బాబాసాహెబ్ అంబేడ్కర్ రూపకల్పన చేసిన రాజ్యాంగాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అపహాస్యం చేశాయని టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి ధ్వజమెత్తారు. ఫిరాయింపులను ప్రోత్సహించి రాజ్యాంగబద్ధంగా ఎన్నికైన 9 ప్రభుత్వాలను బీజేపీ కూలదోసిందని విమర్శించారు.గురువారం ఉదయం ఆయన గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని గాంధీభవన్‌లో జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయిస్తే వారి సభ్యత్వాన్ని రద్దు చేయాలని అన్నారు. అవసరమైతే ఉరి వంటి కఠిన శిక్షలను అమలు చేసే విధానాన్ని తీసుకురావాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. గణతంత్ర దినోత్సవాన్ని ప్రగతిభవన్, రాజ్‌భవన్‌లకు పరిమితం చేసి.. సీఎం కేసీఆర్ ప్రజాస్వామ్యాన్ని నవ్వులపాలు చేశారని విమర్శించారు. గణతంత్ర దినోత్సవాన్ని జరపాలని హైకోర్టు, ప్రభుత్వానికి చెప్పాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ మాజీ చీఫ్ పొన్నాల, ఏఐసీసీ కార్యదర్శి నదీమ్ జావీద్, ఏఐసీసీ జాతీయ అధికార ప్రతినిధి పవన్ ఖేరా, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ అంజన్ కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.


మిర్చి రైతులతో మాట్లాడుతున్న భట్టి విక్రమార్క

ప్రజాసమస్యలపై అసెంబ్లీలో నిలదీస్తా

'హాథ్ సే హాథ్ జోడో'లో భట్టి విక్రమార్క

ఎర్రుపాలెం: వచ్చే నెల 3వ తేదీ నుంచి జరగనున్న అసెంబ్లీ సమావేశాల్లో ప్రజాసమస్యలపై ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీస్తామని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం మామునూరు గ్రామంలో గురువారం రాజీవ్‌గాంధీ విగ్రహానికి నివాళులర్పించి కాంగ్రెస్ జెండాను ఆవిష్కరించిన ఆయన హాథ్ సే హాథ్ జోడో యాత్రను ప్రారంభించారు. గ్రామంలో కాలినడకన పర్యటిస్తూ మిర్చి రైతుల కష్టాలు, కూలీలు సమస్యలు వినడంతో పాటు ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. ఈసందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ ప్రధాని మోదీ పాలనలో ప్రజల మధ్య ఆర్థిక అసమానతలు పెరిగిపోయాయని విమర్శించారు. ప్రధాని, కేంద్రమంత్రి అమిత్‌షా కలిసి దేశ సంపదను అంబానీ, అదానీలకు దోచిపెడుతున్నారని ఆరోపించారు. ఏ కాయ కష్టం చేయకుండానే అంబానీ, అదానీలు లక్షల కోట్లు ఎలా సంపాదించారో చెప్పాలని భట్టి ప్రశ్నించారు. ప్రజలకు మాయమాటలు చెప్పి కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం లౌకిక వాదాన్ని పక్కకు పెట్టి మతం పేరిట ప్రజలను విడగొట్టి వైషమ్యాలను పెంచుతూ లబ్ధికి యత్నిస్తోందని ధ్వజమెత్తారు.

ఈటలకు ఆ విషయం ఆలస్యంగా అర్థమైంది

- మీడియాతో చిట్‌చాట్‌లో రేవంత్‌రెడ్డి
- పొంగులేటితో భట్టి మాట్లాడుతున్నారు
- కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఎన్నికల్లో పోటీ వయసును తగ్గిస్తాం

సాక్షి, హైదరాబాద్: బీజేపీలో కూడా కేసీఆర్ కోవర్టులు ఉన్నారనే విషయం మాజీ మంత్రి ఈటల రాజేందర్‌కు కొంత ఆలస్యంగా అర్థమైందని టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఏ లక్ష్యం కోసం రాజేందర్ బీజేపీలోకి వెళ్లారో అది అక్కడ నెరవేరడం లేదన్న విషయం ఆయన మాటల్లో స్పష్టమవుతోందని అన్నారు. గురువారం గాంధీభవన్‌లో జరిగిన రిపబ్లిక్ డే ఉత్సవాల్లో పాల్గొన్న అనంతరం ఆయన ఇతర నాయకులతో కలసి మీడియాతో చిట్‌చాట్ చేశారు. కేసీఆర్‌ను గద్దెదించాలన్న లక్ష్యంతో ఈటల రాజేందర్ బీజేపీలో చేరారని, కానీ బీజేపీలోకి వెళ్లాక ఈటలకు అక్కడ కూడా కేసీఆర్ కోవర్టులు ఉన్నారని అర్థమైందని, దీంతో తన లక్ష్యసాధన కోసం ప్రత్యామ్నాయ మార్గం వెతుక్కోవాల్సి పరిస్థితి వచ్చిందని అన్నారు. రాజేందర్‌కు ఇష్టం లేని పనులను కేసీఆర్ చేయిస్తున్నారన్నారు. లెఫ్టిస్ట్ అయిన రాజేందర్‌ను బీజేపీలోకి వెళ్లేలా చేశారని, హుజూరాబాద్‌లో డబ్బులు పంచేలా చేశారని పేర్కొన్నారు. రాజేందర్‌తో పాటు బీజేపీలో చేరిన నాయకులు ఇప్పుడు ఆ పార్టీలో సంతృప్తిగా లేరని అన్నారు. ఈటల, వివేక్, విశ్వేశ్వర్ రెడ్డి.. బీజేపీ సిద్ధాంతాలను విశ్వసించరని, కేవలం కేసీఆర్‌ను మాత్రమే వ్యతిరేకిస్తారని చెప్పారు. ఇప్పుడు ఎవరి దారి వారు చూసుకునే పరిస్థితి వచ్చిందని వ్యాఖ్యానించారు.

పొంగులేటితో చర్చలు..

ఖమ్మంలో పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో భట్టి విక్రమార్క మాట్లాడుతున్నారని, పార్టీ అధిష్టానం భట్టికి ఆ బాధ్యతను అప్పగించిందని రేవంత్‌రెడ్డి వెల్లడించారు. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పార్టీ ఫిరాయింపుల చట్టాన్ని కఠినతరం చేస్తామని, శాసనసభకు పోటీ చేసే వయసును 25 సంవత్సరాల నుంచి 21కి తగ్గిస్తామని చెప్పారు. కాంగ్రెస్ నేతలు కోదండరెడ్డి, చెరుకు సుధాకర్ మాట్లాడుతూ, కమ్యూనిస్టులు కేసీఆర్‌కు కొమ్ముకాస్తున్నారని విమర్శించారు. ఈటల ఇప్పుడు బాధపడి ప్రయోజనం లేదని అన్నారు.

కుండలినియోగాతో సమాజానికి ప్రయోజనం



జడ్చర్ల టౌన్: కుండలినియోగాతో సమాజానికి ఎంతో ప్రయోజనం ఉందని కేంద్రీయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ సీఆర్ రావు అన్నారు. మండలంలోని గొల్లపల్లి లలితాంబికాతపోవనంలో సర్వేశ్వరానందగిరి ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న కుండలిని సింపోసిజమ్ అంతర్జాతీయ సదస్సును గురువారం ఆయన జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అనంతరం ప్రసంగిస్తూ కుండలినియోగపై అనేక సందేహాలున్నాయని వాటన్నింటిని తీర్చాల్సిన బాధ్యత తమలాంటి వారిపై ఉందన్నారు. కుండలినియోగాకు సాంకేతిక జోడించి సరైన గురువు వద్ద శిక్షణ పొందితే అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయన్నారు. భారతదేశ సంస్కృతి, సంప్రదాయాలు ఎంతో భిన్నమైనవని, వాటన్నింటిలోనూ యోగా దాగి ఉందన్నారు. కుండలినియోగ ద్వారా అసాధ్యాలు సుసాధ్యం చేయవచ్చన్నారు. పూర్వకాలంలో రుషులు, యోగులు ఇలాంటి వాటి సాధన ద్వారానే అన్నపానీయాలు లేకుండా రోజుల తరబడి తపస్సులో ఉండేవారని గుర్తు చేశారు. కుటుంబ, సమాజ శ్రేయస్సుకోసం కుండలినియోగాతో సాంకేతికతను ఆధ్యాత్మికతను జోడించటం కోసం నిర్వహిస్తున్న సదస్సును సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. సదస్సులో హిమాలయాల నుంచి వచ్చిన యోగిపుంగవులతోపాటు విదేశాలనుంచి ప్రతినిధులు వర్చువల్ ద్వారా పాల్గొన్నారు. సదస్సులో ఆయా ప్రాంతాల నుంచి వచ్చిన ప్రతినిధులు శేషభట్టార్ సుదర్శనాచార్య, సీఎస్ఆర్ ప్రభు, యోగానందభారతిస్వామి, సురేష్‌వర్మ, డా.పద్మజ, రవికుమార్‌సక్సేనా సందేశం ఇచ్చారు.

రామన్‌పాడులో పూర్తిస్థాయి నీటిమట్టం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో గురువారం పూర్తిస్థాయి నీటిమట్టం 1,021 అడుగుల వరకు వచ్చి చేరింది. జూరాల ఎడమ కాల్వ ద్వారా 1,140, సమాంతర కాల్వ ద్వారా 153 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. ఎన్టీఆర్ కాల్వ ద్వారా 1,050, తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నారు.

జోగుళాంబా పాహిమాం

- వైభవంగా అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవం
- తరలొచ్చిన వేలాది మంది భక్తులు
- సహస్ర కలశాలతో అభిషేకం
- భక్తులకు నిజరూపదర్శన భాగ్యం


కలశాలతో వస్తున్న ఎమ్మెల్యే అబ్రహం, ప్రజాప్రతినిధులు


ఆది దంపతుల శాంతి కల్యాణ మహోత్సవం


పూజలు చేసిన కలశాలను తలపై ఎత్తిన చైర్మన్, ఈఓ, ధర్మకర్తలు, అర్చకులు

అలంపూర్/ జోగుళాంబ శక్తిపీఠం/ అలంపూర్ రూరల్: జోగుళాంబ మాత నిజరూప దర్శన భాగ్యం కలిగింది. అలంపూర్ క్షేత్రం ఆధ్యాత్మిక వాతవరణం సంతరించకుంది. జోగుళాంబ మాత పాహిమాం.. అంటూ భక్తులు శరణు కోరారు. అష్టాదశ శక్తి పీఠాల్లో ఐదవ శక్తి పీఠం క్షేత్రంలో వెలిసిన జోగుళాంబ అమ్మవారి 18వ వార్షిక బ్రహ్మోత్సావాలు గురువారం అత్యంత వైభవోపేతంగా ముగిశాయి. వేద పండితులు ఆలయ ప్రాంగణంలోని యాగశాలలో యాగ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్ణాహుతి సమర్పించారు.

సహస్ర కలశాలకు ప్రత్యేక పూజలు

అమ్మవారి సహస్రఘట్టాభిషేకం కనుల పండువగా నిర్వహించారు. మండపం ఎదుట సహస్ర కలశాలను ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, ఈఓ పురేందర్‌కుమార్ అర్చకులతో కలిసి సాంప్రదాయ పద్ధతిలో నవ ఔషధి కలశ జలాలతో పూజించి హారతిని అందజేశారు. అనంతరం కలశాలను చైర్మన్, ఈఓ, ఆలయ ధర్మకర్తలు తలపై ధరించగా ఆలయ అర్చకులు త్రిశూల స్వామితో మంగళవాయిద్యాల మధ్య ఉత్సవబలిభేరితో గర్భాలయానికి చేరారు. అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి వసంత పంచమి సందర్భంగా భక్తులకు జోగుళాంబ మాత నిజరూప దర్శనభాగ్యం కల్పించారు. భక్తులు జోగుళాంబ మాత జయ జయ ధ్వనులు చేయడంతో ఆలయ ప్రాంగణాలు మార్మోగాయి. భక్తులు ఒక్కొక్కరుగా కలశాలతో వచ్చి అర్చకులకు అందించగా అమ్మవారిని అభిషేకించారు. ఈ ఘట్టం దాదాపు 6గంటల పాటు కొనసాగింది.


ఆలయంలో ధ్వజ అవరోహణం

అమ్మవారికి అభిషేకం

అభిషేకంలో భాగంగా అమ్మవారికి పాలు, పెరుగు, నెయ్యి, తేనే, చక్కెర, పళ్లరసాలు, కుంకుమ, పసుపు, భస్మం, గంధం, పన్నీరు, మంగళ ద్రవ్యాలతో అభిషేకించారు. పెద్ద సంఖ్యలో తరలి వచ్చిన భక్తులు అభిషేక పూజల్లో పాల్గొని అమ్మవారి దీవెనలు పొందారు. అనంతరం పట్టు వస్త్రాలు, పూల మాలలతో, నిమ్మకాయల హారతులతో, స్వర్ణాభరణాలతో అలంకరించారు. అర్చకులు అమ్మవారికి దశవిధ హారతులు ఇచ్చారు. బాలబ్రహ్మేశ్వర స్వామి, జోగుళాంబ అమ్మవారి ఆలయాలు కిటకిటలాడాయి. భక్తులకు ఆలయ అధికారులు అన్నదాన సదుపాయం కల్పించారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. డీఎస్పీ రంగస్వామి భద్రతను పర్యవేక్షించారు.

తరలొచ్చిన మహిళలు

బ్రహ్మోత్సవాలకు వివిధ ప్రాంతాల నుంచి కలశాలతో ఊరేగింపుగా మహిళలు తరలివచ్చారు. క్షేత్రంలోని కట్టెలపేట, కన్యకాపరమేశ్వరి, చౌక్‌బజార్, పోస్టాఫీస్, న్యూ ప్లాట్స్, అంబేద్కర్ కాలనీ, అక్బర్‌పేట కాలనీలతోపాటు లింగనవాయి, బుక్కాపురం, సుల్తానాపురం, భైరాపురం, కాశీపురం గ్రామాల నుంచి మహిళలు కలశాలను శిరస్సున ధరించి ఊరేగింపుగా వచ్చారు. అందరూ గాంధీచౌక్‌కు చేరుకోని అక్కడ అమ్మవారి ఉత్సవవిగ్రహ ప్రతిమతో ఆలయాలకు చేరుకున్నారు. ఏపీలోని ఏలురుకు చెందిన 40 మంది కళాకారులు గ్రామ దేవతల వేష ధారణలతో ఊరేగింపులో విన్యాసాలు చేశారు.

ఆది దంపతుల కల్యాణం

బ్రహోత్సవాల ముగింపులో భాగంగా జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వరాస్వామి వారి శాంతి కల్యాణోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళాష్టకాలు పఠిస్తూ దేవతమూర్తులకు తలంబ్రాలు పోశారు. అక్షతరోపణంలో భాగంగా ఛతుర్వేద పారాయణాలు, లగ్నాష్టకాలు వల్లె వేశారు.

ధ్వజారోహణం

ధ్వజారోహణ కార్యక్రమంతో ఉత్సవాలు పరిసమాప్తి అయ్యాయి. ఈ సందర్భంగా అధికారికంగా ఆలయ ఈఓ, చైర్మన్ ధ్వజపతకాన్ని కిందికి దించారు. అనంతరం అమ్మవారికి దశవిధ హారతులు అందజేశారు. మహా మంగళ హారతితో కార్యక్రమాలకు ముగింపు పలికారు.


బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణను ఆహ్వానిస్తున్న ఈఓ

ఉత్సవాలలో ప్రముఖులు

వార్షిక బ్రహోత్సవాల చివరి రోజు భక్తులతోపాటు రాజకీయ ప్రముఖులు, అధికారులు హాజరయ్యారు. మహబుబ్‌నగర్ జిల్లా జడ్జి కనకదుర్గ, గద్వాల సీనియర్ సివిల్ జడ్జి గంటా కవిత, అలంపూర్ జూనియర్ సివిల్ జడ్జి కమలాపురం కవిత, జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ సరిత, ఎమ్మెల్యే అబ్రహం, మహబుబ్‌నగర్ జిల్లా ఎస్పీ వెంకటేశ్వర్లు, మున్సిపల్ చైర్‌పర్సన్ మనోరమ, బెంగుళూరు రిటైర్డ్ కలెక్టర్ రామాంజనేయులు, బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ బ్రహ్మోత్సవాలకు హాజరయ్యారు. ఆలయ అధికారులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.


ఆలయంలో బారులు తీరిన భక్తులు


మండపంలో కిక్కిరిసిన భక్తులు


హోమ మండపంలో పూర్ణాహుతి సమర్పిస్తున్న అర్చకులు